రహదారులకు పూల సోయగం.. 2


'సర్' ఫారం.. నింపండి ఇలా..? 2


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## 'దోస్త్' ద్వారా కోర్సు మార్చుకునే అవకాశం

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు తాము చేరిన కాలేజీలో కోర్సు మార్చుకునేందుకు అవకాశం ఉందని తెయూ దోస్త్ సమన్వయ కర్త వాసం. చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు ఈ మేరకు ఇంట్రా కాలేజీ ఫేజ్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలైందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుండి 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు. ఈ వెసులుబాటు తెలంగాణ యూనివర్సిటీలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కూడా వర్తిస్తుందని చెప్పారు. అయితే విద్యార్థులు కోరుకున్న కోర్సులో సీట్లు ఖాళీగా ఉంటేనే ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని, ఒకవేళ ఇంట్రా కాలేజీ ఫేజ్‌లో కొత్త కోర్సు రాకపోతే, ప్రస్తుతం ఉన్న సీటు అలాగే ఉంటుందని పేర్కొన్నారు.



## జగన్నాథ రథయాత్రకు భక్తులు తరలిరావాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఇస్కాన్ జగన్నాథ రథయాత్రకు భక్తులు భారీగా తరలిరావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం నుంచి ఈ నెల 24న రథయాత్ర ఉంటుందన్నారు. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించే రథయాత్రలో ఇందూరు భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఇస్కాన్ సేవలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయని కొనియాడారు. నీలకంఠేశ్వరాలయం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర నగరంలోని ప్రధాన వీధుల మీదుగా తిరిగి కంఠేశ్వర్‌లోని శ్రీరామ గార్డెన్‌కు చేరుకుంటుందన్నారు. ఇస్కాన్ కంఠేశ్వర వ్యవస్థాపక అధ్యక్షుడు రామానంద రాయి గౌరదాస ప్రభుజీ, నిత్యాచాంద్ ప్రభుజీ, బలరాం ప్రభు జీ, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, సీనియర్ నాయకులు స్వామి యాదవ్, రఘుపతి గౌడ్, రోహిత్ ప్రభుజీ, సునీల్ ప్రభూజీ, భార్గవ్ ప్రభుజీ తదితరులు పాల్గొన్నారు.




## రెండు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు..

**అక్షరటుడే, ఆర్మూర్:** పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న రెండు స్కూళ్లకు విద్యాశాఖాధికారులు నోటీసులు అందించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. ఆలూరు ఎంఈవో నరేందర్ బుధవారం మండల పరిధిలోని కల్లడి గ్రామంలో ఉన్న హోవర్డ్ పార్క్, వాగ్దేవి ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. హోవర్డ్ పార్క్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నట్లు గుర్తించిన ఎంఈఓ, పాఠ్యపుస్తకాల నిల్వ గదికి సీల్ వేసి యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. అలాగే శిక్షణ లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తున్నట్లు గుర్తించి, వెంటనే అర్హత కలిగిన శిక్షణ పొందిన ఉపాధ్యాయులతోనే తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హోవర్డ్ పార్క్, వాగ్దేవి పాఠశాల యాజమాన్యాలకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసిన ఎంఈవో, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ మార్గదర్శకాల మేరకు విద్యా బోధన, నిర్వహణ చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో పదవుల పందేరం మొదలైంది. రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్ల ఛైర్మన్ పదవీ కాలం నేటితో ముగిసింది. ఇప్పటి వరకు ఆ పదవుల్లో ఉమ్మడి జిల్లా నేతలు ఉండటంతో.. మరోసారి జిల్లా నాయకులు వాటి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్య నాయకుల చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఛైర్మన్ పదవులు కావడంతో పోటీ తీవ్రంగా ఉంది. పదవి ఎవరికి దక్కుతుందోనన్న చర్చ సాగుతోంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

# 'కార్పొరేషన్' దక్కేదెవరికో..

- కొత్తగా ఆశించే నలుగురిలో ఇద్దరు మహిళలు
- ప్రజల్లో ఫాలోయింగ్‌ను బట్టి పదవులు కట్టబెట్టే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో పదవులపై కొనసాగుతున్న సస్పెన్స్
- జోరుగా ఆశావహుల మంతనాలు

రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్ల పదవీకాలం నేటితో ముగిసింది. దీంతో ఆయా పదవుల్లో కొనసాగుతున్న ఛైర్మన్లు బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. కొత్త నియామకాల ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వర్గాల్లో కదలిక మొదలైంది. ఇప్పటికే పదవుల్లో కొనసాగిన వాళ్లు తిరిగి అదే పదవి తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపడం లేదన్న ప్రచారం సాగుతోంది. దాంతో వారిని పార్టీలో క్రియాశీలకంగా పని చేసేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు రాజకీయవర్గాల భోగట్టా..

### ఉమ్మడి జిల్లాకే నాలుగు పదవులు

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులలో నాలుగు ఛైర్మన్లు ఉమ్మడి జిల్లాకు దక్కాయి. ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కాసుల బాల రాజు, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా అన్వేష్ రెడ్డి, సహకార సంఘాల ఛైర్మన్‌గా మానాల మోహన్ రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఈరవత్రి అనిల్ విధులు నిర్వర్తించారు. ఇప్పుడు వీరి పదవీకాలం పూర్తికావడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి.

### ఇద్దరు మహిళలు..?

కొత్త నియామకాల కోసం ఉమ్మడి జిల్లా నుంచి పలువురు నేతలు అధిష్టానం వద్ద పైరవీలు చేస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం నలుగురు ప్రధాన ఆశావహులు రేసులో ఉన్నట్లు సమాచారం. వారిలో ఇద్దరు మహిళలు ఉండటం గమనార్హం. మహిళలకు, యువ నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ విధానం నేపథ్యంలో ఈసారి జాబితాలో మార్పులు ఉండొచ్చని చర్చ జరుగుతోంది. పదవులు ఆశించే వారిలో కామారెడ్డి డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి దేవరాజు గౌడ్‌తో పాటు మహిళల కోటాలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఆల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అల్కా లాంబను గడ్డం ఇందుప్రియ కలిశారన్న టాక్ వినిపిస్తోంది.

### కష్టపడే వారికే..

గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి, నియోజకవర్గాల్లో యాక్టివ్‌గా ఉన్న నేతలకు అవకాశం ఇవ్వాలని అధిష్టానం భావిస్తోంది. ప్రజల్లో గుర్తింపు ఉన్నవారికి, పార్టీ బలోపేతానికి పనిచేసే వారికి ఈసారి పదవులు కట్టబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎవరెవరికి దక్కుతాయని ఉత్కంఠ మాత్రం కొనసాగుతోంది.

### కొనసాగుతున్న సస్పెన్స్

ఒకే జిల్లా నుంచి 4 కార్పొరేషన్లు రావడం గతంలో అరుదు. అందుకే ఈసారి కూడా ఉమ్మడి జిల్లా కు ఎన్ని సీట్లు దక్కుతాయన్న దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కుల సమీకరణాలు, ప్రాంతీయ బ్యాలెన్స్, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఆశావహులు ఢిల్లీ, హైదరాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసారి ఎలాగైనా తమకు అవకాశం ఇవ్వాలని అర్జీ పెట్టుకుంటున్నట్టుగా ప్రచారం సాగుతోంది.

### నేటితో ముగిసిన పదవీకాలం..

నేటితో నాలుగు కార్పొరేషన్ల పదవీకాలం అధికారికంగా ముగిసింది. వారం, పది రోజుల్లో కొత్త ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. అప్పటివరకు కార్పొరేషన్ దక్కేదెవరికో అన్నది జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా నిలవనుంది. నాయకులు మాత్రం తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నారు. కార్పొరేషన్ పదవి చేపట్టి తమ కలను సాకారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ అధిష్టానం ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



## ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి


**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకులు కోరారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమర జ్యోతి కార్యాలయంలో విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమ నాయకుల సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి వర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకులు హాజరయ్యారు. కమిటీ ఛైర్మన్ కేశవరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలను విద్యార్థి నాయకులు కలిశారు. నిజామాబాద్ జిల్లా విద్యార్థుల అభిప్రాయాలు, కీలక సూచనలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.





## ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఏఐటీయూసీ ధర్నా

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బందికి సంబంధించిన వేతన సవరణ ఒప్పందం కాలపరిమితి ముగిసి ఏడాది గడిచిందన్నారు. అయినప్పటికీ వేతనాలు పెరగకపోవడం అన్యాయమని అన్నారు. ప్రస్తుతం కార్మికులపై పని భారం పెరుగుతున్నందున కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.ఈనెల 9న కోటిలోని డీఎంఈ కార్యాలయం ముట్టడి ఉంటదన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. యూనియన్ కోశాధికారి భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, భారతి, కవిత, వెంకటేష్, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంచర్ నిర్వాహకులపై చర్యలకు కౌన్సిలర్ల డిమాండ్..





**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని 25వ వార్డులో ఉన్న ఓ వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. డీటీసీపీ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌ను అభివృద్ధి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లేఅవుట్‌లోని అంతర్గత రహదారులు ప్రజలందరికీ అందుబాటులో ఉండాల్సి ఉండగా, వెంచర్ చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రవేశ ద్వారాల వద్ద గేట్లు పెట్టి తాళాలు వేయడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఓపెన్ స్పేస్‌లను నిబంధనల ప్రకారం అభివృద్ధి చేయలేదని, వర్షపు నీటి పారుదలకు సరైన ఏర్పాట్లు లేవని, ఒక ఎకరానికి సరిపడా ఇంకుడు గుంతలు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టలేదన్నారు. ఓపెన్ స్పేస్‌లో కనీస వసతులు కూడా కల్పించలేదని ఆరోపించారు. వెంచర్‌కు ఆనుకొని ఉన్న తూము, డ్రైనేజ్ కాలువకు డీటీసీపీ నిబంధనల ప్రకారం వదలాల్సిన బఫర్ జోన్‌ను వదలకుండానే నిర్మాణాలు చేపట్టడం పర్యావరణ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఏ ఒక్క ప్రమాణాన్ని పాటించకపోయినా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలను పక్కనబెట్టి సదరు వెంచర్‌కు ఫైనల్ లేఅవుట్ అనుమతులు మంజూరు చేశారని కౌన్సిలర్లు ఆరోపించారు. అందువల్ల నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై, అలాగే వెంచర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ప్రముఖమైనదని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్, జాకోరా జీపీలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనగర్, జాకోరా జీపీ కార్యాలయాల్లో 'మన ఊరు -మన భద్రత – మన బాధ్యత'లో భాగంగా 31 సీసీ కెమెరాలను సీపీ సాయిచైతన్య ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని.. సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో ప్రజలు ముందుకు భాగస్వాములు కావాలని కోరారు. దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, వర్ని ఎస్సై వంశీ కృష్ణ, కోటగిరి ఎస్సై శ్రీనివాస్, రుద్రూర్ ఎస్సై మనోజ్, శ్రీనగర్ సర్పంచ్ పూర్ణిమ కిరణ్, జాకోరా సర్పంచ్ పెద్దసాయిలు, మాదాల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, సెక్రెటరీ ఠాకూర్, రిటైర్డ్ సైంటిస్ట్ తోట చేతన్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## రేపు జానకంపేట్ గూడ్స్ షెడ్ జాతికి అంకితం..
## ఎంపీ కృషితో పూర్తయిన నిర్మాణం



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో జానకంపేట వద్ద నిర్మించిన రైల్వే గూడ్స్ షెడ్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మేరకు 9న ఈ షెడ్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలో రైల్వే స్టేషన్‌లో మూడు రైల్వేట్రాక్‌లను ప్రయాణికుల రాకపోకలకు కేటాయించారు. నాలుగో ట్రాక్ సైతం ఉండగా దాని మీదుగా గూడ్స్ రైళ్ల ద్వారా సరుకుల రవాణా జరుగుతూ ఉండేది. అయితే స్టేషన్‌లో ఈ రవాణా కారణంగా నిత్యం వందలాది లారీలు వస్తూ పోతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఇబ్బందిగా మారింది. రైల్వే ప్రయాణికులకు సైతం ఇబ్బందిగా మారడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఎంపీ అర్వింద్ సమస్యను విన్నవించారు. సరుకుల రవాణాను జానకంపేట వద్ద గూడ్స్ షెడ్ నిర్మించి అక్కడికి మార్చాలని కోరారు. ఆయన కృషి ఫలితంగా ఇటీవల గూడ్స్ షెడ్ రూపు దిద్దుకుంది. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేకంగా ట్రాక్‌ను ఏర్పాటు చేసిన అధికారులు గూడ్స్ లోడింగ్ అన్‌లోడింగ్ అక్కడి నుంచే నిర్వహించనున్నారు. దీంతో నిజామాబాద్ రైల్వే స్టేషన్లో గూడ్స్ రవాణా రాకపోకలు త్వరలోనే నిలిచిపోనున్నాయి. ఈ సరుకు రవాణాను జానకంపేట గూడ్స్ షెడ్‌కు మార్చిన అధికారులు రెండునెలల క్రితం ట్రయల్ రన్ నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి నిజామాబాద్‌కు.. అలాగే జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు యూరియా, బియ్యం ఇతర వస్తువులు లోడింగ్ అన్‌లోడింగ్ అంతా జానకంపేట గూడ్స్ షెడ్ నుంచే జరగనున్నాయి. ఈ మేరకు రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గూడ్స్ షెడ్‌కు పూర్తిగా గూడ్స్‌రైళ్లు వెళ్లిపోతే.. రైల్వే సమయాల్లో తేడాలు లేకుండా రైళ్ల రాకపోకలు సాగించే అవకాశం ఉంది. గూడ్స్ షెడ్డును గురువారం ఎంపీ అర్వింద్ జాతికి అంకితం చేయనున్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, అంజిరెడ్డి, కొమరయ్య, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తదితరులు పాల్గొననున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు సైతం పూర్తి చేశారు.

## దేగాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం దేగాం గ్రామంలో నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేగాం గ్రామంలో ప్రజలు ఎవరైనా అనారోగ్య రీత్యా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఖర్చులను సీఎంఆర్ఆఫ్ ద్వారా ఇప్పిస్తానని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి అనారోగ్యంతో ఉంటే ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎల్ఓసీ ఇప్పించి వైద్య సేవలు అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మండల్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు మేకల శివ, సీనియర్ నాయకులు కేశవులు, బస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితురాలి కూతురికి 'పూర్వ విద్యార్థుల' ఆసరా



**అక్షరటుడే,మాక్లూర్:** తమతోపాటు కలిసి చదువుకున్న తోటి స్నేహితురాలి కూతురికి చేయూతనందించి పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. మాక్లూర్ మండలం గొట్టుముక్కల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న ధర్మోర గ్రామానికి చెందిన నవనీత.. ఏడాది క్రితం అనారోగ్యంతో మరణించింది. ఇటీవల నవనీత బ్యాచ్‌మేట్స్ అందరూ కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం (గెట్‌టుగెదర్) నిర్వహించారు. ఆ రోజు తీసుకున్న నిర్ణయం మేరకు.. నవనీత కూతురు సిద్ధికకు బుధవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రతి ఏడాది ఇదేవిధంగా పాపకు సాయం అందిస్తామని, బాగా చదువుకోవాలని ఆ చిన్నారికి భరోసా ఇచ్చారు. ధర్మోర ఉపసర్పంచ్ నాగేష్, పాఠశాల హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయుడు కపిల్ దేవ్, పూర్వ విద్యార్థులు సౌజన్య, రమ్య కృష్ణ, సంతోష్, రవి, ప్రకాష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## కువైట్‌లో కోరట్‌పల్లి తండా యువకుడి పూడ్చివేత



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** కువైట్‌లో కనిపించకుండా పోయిన డిచ్‌పల్లి మండలం కోరట్‌పల్లి తండా వాసి శవమయ్యాడు. అక్కడి సాల్మి ఎడారిలో అతడిని పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కువైట్‌లోని సాల్మి ఎడారి ప్రాంతంలో హైవే పనుల నిమిత్తం మార్చి 19వ తేదీన వెళ్లిన యువకుడు గుగ్లోత్ కైలాష్(30) మరణించినట్లు కువైట్ దేశ పోలీసులు ప్రకటించారు. విషయాన్ని బయటకు రాకుండా ఉండేందుకు యజమాని, మరొకరి సహాయంతో మృతదేహాన్ని ఎడారిలోనే ఇసుకలో పాతిపెట్టారు. తర్వాత సదరు కార్మికుడు కైలాష్ కనిపించడం లేదంటూ పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. కువైట్‌లో మార్చి 19న ఈ ఘటన జరుగగా పోలీసులు కేసు నమోదు చేశారు. సుదీర్ఘంగా ఇన్వెస్టిగేషన్ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలను ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ ఫుటేజీలో నమోదైన వీడియో ఆధారాలతో కువైట్ పోలీసులు అక్కడే ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా... క్రేన్ ప్రమాదంలో అతడు (కైలాష్) చనిపోయాడని, భయంతో తాను, తన తండ్రి కలిసి కైలాష్ శవాన్ని అక్కడే పాతిపెట్టామని నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు డిచ్‌పల్లి మండలం సాంపల్లి తండా పంచాయతీ పరిధిలోని ఓ తండాకు చెందిన యువకుడు కావడం గమనార్హం. అయితే ఈ నేరంలో నిందితుడి తండ్రి కువైట్ దేశం విడిచి పారిపోయినట్లు అక్కడి ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు తెలిసింది.

ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా వాటిని రూపొందించడం ఎన్నికల సంఘం విధి. అందులో భాగంగానే ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ప్రారంభమైంది. ఓటర్ జాబితాలో సవరణ చేయడానికి బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) ఇంటికి వచ్చి తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉండే ఎన్యుమరేషన్ ఫారం అందించారు. ఈ ఫారాలను నిందపేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



# 'సర్' ఫారం.. నింపండి ఇలా..?

- కొనసాగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ
- వాడవాడలా అవగాహన కార్యక్రమాలు
- పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

ఎన్యుమరేషన్ ఫారంను నింపిన అనంతరం ఓటర్లు కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఫారానికి అతికించాలి. అనంతరం దానిని బీఎల్‌వోలకు ఇవ్వాలి. స్పష్టమైన వివరాలు అందించడం వల్ల భవిష్యత్తులో ఓటర్ కార్డు గల్లంతు కాకుండా ఉంటుంది. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూడడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా మనం ఓటు వేయవచ్చు.

### ఫారంలో రెండు విభాగాలు..

2002 నాటికి ఓటు ఉండి ఉంటే.. 2002 ఓటర్ జాబితాలో వివరాలు ఆధారంగా ఆ కాలాన్ని నింపాలి. ఓటరు పేరు, ఓటరు గుర్తింపు కార్డు నెంబరు, బంధువు పేరు, అతనితో మీకు ఉన్న బంధుత్వం ఏమి రాయాలి. 2002 ఓటర్ జాబితాలో ఉన్న శాసన సభ నియోజక వర్గ సంఖ్య, పోలింగ్ స్టేషన్ నెంబరు (భాగం సంఖ్య), క్రమసంఖ్య (ఓటరు జాబితాలో మీ సీరియల్ నెంబరు) ఎంత అనేది వేయాలి.

### 2002 నాటికి ఓటు లేకపోతే..

2002 నాటికి నాటికి ఓటు లేకపోతే.. 2002 ఓటర్ జాబితాలో మీ తండ్రి, తల్లి, తాతయ్య, నానమ్మల్లో ఎవరికి ఓటు ఉందో వారి వివరాల ప్రకారం ఈ బాక్స్ పూరించాలి. పేరు అనే బాక్స్ తండ్రి, తల్లి, తాతయ్య, నానమ్మలో ఎవరిదైనా పేరు రాసి, వారి ఓటరు గుర్తింపు కార్డు నెంబరు వేయాలి. బంధువు అనే బాక్స్‌లో తండ్రి లేదా తల్లి పేరు రాయాలి. 2002 ఓటర్ల జాబితా శాసనసభ నియోజకవర్గ సంఖ్య, పోలింగ్ స్టేషన్ నెంబరు (భాగం సంఖ్య), క్రమసంఖ్య అంటే ఓటర్ లిస్టులో వారి సీరియల్ నెంబరు ఎం ఆ అనేది వేయాలి. మొత్తంగా 2002లో మీకు ఓటు లేదు కానీ మీ బంధువుల్లో ఓటు ఉన్న వారి వివరాలు ఈ బాక్సులో నింపాలి.

### ఫారం పైభాగంలో..

మీ పేరు, మీ ఓటర్ ఫొటో గుర్తింపు కార్డు నెంబరు, చిరునామా, అసెంబ్లీ పేరు, తదితర వివరాలు, పాత ఫొటోతో ముందుగా ముద్రించి ఉంటాయి. అక్కడే చక్కగా మీ రీసెంట్ ఫొటో తప్పనిసరిగా అతికించాలి. మొదటి భాగంలో 2002లో ఓటు ఉన్నవారి కోసం ఒక బాక్స్, 2002లో ఓటు లేనివారి కోసం మరో బాక్స్ ఉంటుంది. ఈ రెండు అంశాల్లో ఒకదానిని మీ పరిస్థితికి అనుగుణంగా నింపాలి.

### మరో భాగం..

చివరి భాగంలో ఓటరు ప్రస్తుత వివరాలను నింపాలి. పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నెంబరు, మొబైల్ నెంబరు, సంబంధిత పేరు, సంబంధిత ఓటరు గుర్తింపు కార్డు నెంబరు, తల్లి పేరు, తల్లి ఓటర్ గుర్తింపు కార్డు నెంబరు, పెళ్లి అయితే మీ భార్య/భర్త పేరు వారి ఓటర్ గుర్తింపు కార్డు నెంబరు నింపాలి. పెళ్లి కాకుంటే ఆ బాక్సులు ఖాళీగా వదిలేయాలి.

### ప్రక్రియపై సిబ్బందికి సూచనలు ఇచ్చాం..



ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలో ఇప్పటికే సిబ్బందికి అవగాహన కల్పించి సూచనలు చేశాం. ప్రజలు ఫారంలో ఉన్న కాలమ్స్ చూసి ఇబ్బంది పడుతున్నారు. ఫారాల్లో పూర్తిగా చదివిన తర్వాతే దాన్ని నింపాలి. తప్పులు లేకుండా నింపడం ద్వారా ఓటర్ కార్డులో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఉంటాయి. సర్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేస్తాం. – **ప్రేమ్, తహశీల్దార్ ఎల్లారెడ్డి**

## ఎస్ఐఆర్ పక్రియపై వివరాల సేకరణ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి గ్రామంలోని 38, 39 బూత్‌లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం జరుగుతోంది. ఈ విషయమై బుధవారం ప్రక్రియపై సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు బీఎల్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు చేపడుతున్న ఎన్యుమరేషన్, ఓటరు వివరాల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు జక్క రాజేశ్వర్, రాజ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు ధనుష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..



**అక్షరటుడే, ఆర్మూర్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పిల్లలకు నాణ్యమైన, శుభ్రతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలపై ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పూర్ణమౌళి పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో దారుణం.. వ్యక్తిని హత్య చేసిన కుటుంబీకులు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మద్యం తాగి వేధిస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని కుటుంబీలకులంతా కలిసి హత్య చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలంలోని అమ్రాబాద్ జీపీ పరిధిలోని కోక్యా నాయక్ తండాలో బానోత్ హరి నిత్యం మద్యం తాగేవాడు. అయితే మద్యం తాగి వేధిస్తున్నాడనే నెపంలో ఆయన కుటుంబీకులంతా కలిసి మంగళవారం రాత్రి బానోత్ హరి గొంతు పిసికి హత్య చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కళామందిర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** తెలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న కళామందిర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన్ కన్వెన్షన్ సెంటర్‌లో కళామందిర్ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హాజరయ్యారు. ఈ వేడుకలకు అతిథులుగా ఏపీ మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, సీనియర్ నటుడు మురళీ మోహన్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్, పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



## కొక్కొండ గ్రామంలో చెత్తబుట్టల పంపిణీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కొక్కొండ గ్రామ పరిశుభ్రతను మెరుగుపర్చే లక్ష్యంతో కొక్కొండ గ్రామంలో చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకవ్వ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. చెత్తను చెత్తబుట్టల్లోనే వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రణీత్ కుమార్, కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం..

### ఐదుగురికి గాయాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ ఐదుగురు మహిళలపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ఐదుగురు మహిళలపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో రాజవ్వ, తిరుపతమ్మతో పాటు మరో ముగ్గురు మహిళలకు తల, కాళ్లు, చేతుల భాగాల్లో గాయాలయ్యాయి. కాలనీకి చెందిన తిరుపతమ్మ తన మనవడిని ఎత్తుకుని కిరాణా షాపుకు వెళ్తుండగా పిచ్చికుక్క ఆమెపైకి వచ్చింది. మనవడిని కాపాడే క్రమంలో తిరుపతమ్మ కిందపడిపోగా కుక్క ఆమె తల, తొడ భాగాలపై తీవ్రంగా కరిచింది. స్థానికులు గమనించి పిచ్చికుక్కను తరిమికొట్టారు. అదే సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న రాజవ్వ, మరో ఇద్దరు మహిళలు, స్కూటీపై వెళ్తున్న మరో మహిళపై కూడా కుక్క దాడి చేసింది. గాయపడ్డ వారిని కాలనీవాసులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

## విద్యను కార్పొరేటీకరణ చేసే యోచనలో బీజేపీ ప్రభుత్వం




**అక్షరటుడే, కామారెడ్డి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పోరేటీకరణ చేసే యోచనలో ఉందని వామపక్ష విద్యార్థి సంఘాలు ఆరోపించారు. జూలై 10న జరగనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం కామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, బీవీఎం ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు నిజాంసాగర్ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్ఈపీ 2020 పేరుతో విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తోందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల లేమి ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల అక్రమ ఫీజులు, బలవంతపు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని కోరారు. జూలై 10న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, ముదాం అరుణ్, జబ్బర్, శివప్రసాద్, విటల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



**అక్షరటుడే, బాన్సువాడ:** ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన బాన్సువాడ పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. డోంగ్లి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత (18) బాన్సువాడలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. బుధవారం ఆమె కాలేజీకి వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉండిపోయింది. అనంతరం గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హాస్టల్ సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, డీఎస్పీ విఠల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఓటర్ జాబితాలో పేర్ల నమోదు, తప్పుల సవరణ కోసం ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసే పనిని అధికారులు, ప్రజా ప్రతినిధులు చురుకుగా చేపట్టారు. నిరక్షరాస్యులు, వృద్ధులు ఫారాలు నింపడంలో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో, ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్ ప్రేమ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 2, 6, 7, 8, 9 వార్డుల్లో కౌన్సిలర్లు మహేశ్వరి విద్యాసాగర్, గఫర్, భాగ్యమ్మ ప్రశాంత్, సిద్ధి శ్రీధర్ గుప్తా, తిరుపతి, పప్పు వెంకటిలు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో వలంటీర్లను ఏర్పాటు చేసి, ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. ప్రతి వార్డులోనూ ఇంటింటికి వెళ్లి ఫారాలు నింపించేలా చర్యలు తీసుకున్నారు. వాటితో పాటు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వారి చొరవతో, ఫారాలు నింపేందుకు వలంటీర్లను నియమించారు. గ్రామస్తులు అక్కడికి వచ్చి సమాచారం ఇచ్చి ఫారాల్లో నమోదు చేయించుకుంటున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిగ్గా అందించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.